వ్యవసాయశాఖ పదోన్నతులపై మంత్రికి వినతి


మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ వ్యవసాయశాఖలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను వెంటనే చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ కృపాకర్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్, నాయకులు శశిధర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశామని, 317 జీవోలో బదిలీ అయిన ఉద్యోగుల పాత సర్వీస్‌ను లెక్కించాలని కోరామన్నారు. బాగ్‌లింగంపల్లిలో వారు మాట్లాడుతూ.. పై డిమాండ్లతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

చేనేత వస్త్రాల ఎక్స్‌పో బ్రోచర్ ఆవిష్కరణ



ఎక్స్‌పో బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కందగట్ల స్వామి తదితరులు

12 నుంచి ప్రారంభంకానున్న ప్రదర్శన

కాచిగూడ: వీవర్స్ వెల్ఫేర్ ట్రస్టు, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈనెల 12,13,14 తేదీల్లో నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో చేనేత వస్త్రాల ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ మధుసూదన్, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు రూపా సదాశివ్, అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి అన్నారు. శనివారం నారాయణగూడలో పద్మశాలి భవన్‌లో చేనేత వస్త్రాల ఎక్స్‌పో బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'చేనేత వస్త్రాలు కొనుగోలు చేద్దాం, నేత వృత్తిని కాపాడుకుందాం'.. అన్న లక్ష్యంతో ఈ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చేనేత పరిశ్రమ సంక్షోభంలో ఉందని, అతి ప్రాచీనమైన చేనేతను కాపాడుకోవాల్సిన సామాజిక బాధ్యత అన్ని వర్గాలపై ఉందని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి వాటిని ధరించేలా ప్రభుత్వాలు ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు. అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం జాతీయ ఇన్‌చార్జి భాస్కర్, దేవేందర్, మాచర్ల రాంచందర్, అంబటి శ్రీనివాస్, స్వప్న, నోముల రేఖ, పద్మ, శ్రావణ్, బైరి అమరావతి, మౌనిక, ప్రణీత, శాంతి, సుజాత తదితరులున్నారు.

నేడు ఎమ్మార్పీఎస్ నిరసన దీక్ష


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: ఎమ్మార్పీఎస్ ఏర్పాటు చేసుకుని 30 ఏళ్లు గడుస్తున్నా సందర్భంగా సంబరాలు చేసుకోవాల్సింది పోయి వర్గీకరణ జరగకపోవడాన్ని నిరసిస్తూ.. నేడు నిరసన దీక్ష చేపడుతున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌మాదిగ తెలిపారు. విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివారం అన్ని పార్టీల నాయకులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థి నాయకులు వచ్చి సంఘీభావం తెలపాలని కోరారు. ప్రజలంతా దీక్షకు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. పొట్టపెంజర రమేష్, కోర్ కమిటిటీ సభ్యులు బంగారి శ్రీను, యాదగిరి, వేణుగోపాల్, కృష్ణ, నరేష్, రాహుల్, వెంకట్, చందు, జీవన్, నాగరాజు, సురేష్, మణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం నిరుద్యోగుల సమస్యలపై స్పందించాలి


మాట్లాడుతున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులతో చర్చించి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్, పీడీఎస్‌యూ జాతీయ నాయకులు ఎస్.నాగేశ్వర్‌రావు, అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, డీవైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్‌లు డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీఎస్సీ, గ్రూప్స్ అభ్యర్థులు రోడ్లెక్కి ఆందోళన చేస్తుంటే వారితో చర్చించకుండా కాంగ్రెస్ విద్యార్థి, యువజన నాయకులతో మాట్లాడటం సరికాదన్నారు. హాస్టల్ వార్డెన్ పరీక్షలు రాసిన కొద్దిరోజులకే డీఎస్సీ ఉందని దానికి సన్నద్ధమయ్యే అవకాశం లేనందున అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. కనీసం 45 రోజులైనా పొడిగించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిరుద్యోగుల సమస్యల పరిష్కరించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, నాగరాజు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలి ఉల్లాఖాద్రీ, ధర్మేంద్ర, వివిధ సంఘాల నాయకులు మణికంఠరెడ్డి, లక్ష్మణ్, మహేష్, హరీష్, జావేద్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

కల్లుగీత కార్పొరేషన్‌కు కమిటీని నియమించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అమరవేణి నర్సాగౌడ్

కాచిగూడ: కల్లుగీత కార్పొరేషన్‌కు నూతన కార్యవర్గాన్ని నియమించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి 'మోకుదెబ్బ' జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. కల్లుగీత కార్పొరేషన్‌కు రూ.5వేల కోట్ల నిధులు కేటాయించి కల్లుగీత వృత్తిని ఆధునీకరించాలన్నారు. ప్రమాదబీమా రూ.10 లక్షల హామీని అమలు చేయాలని కోరారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలన్నారు. జనగామ జిల్లాను పాపన్న జనగామ జిల్లాగా నామకరణం చేసి గెజిట్ విడుదల చేయాలని, గీత కార్మికులకు ద్విచక్ర వాహనాలను ఇవ్వాలని కోరారు. ఏజెన్సీలోని గౌడ కులస్తులను ఎస్టీలుగా గుర్తించి వారి లైసెన్సులను రెన్యువల్ చేయాలన్నారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పై వ్యక్తిగత అనుచిత వాఖ్యలు చేయడం మానుకోవాలని లేనిపక్షంలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. మోకుదెబ్బ నేతలు రాగుల సిద్ధిరాములుగౌడ్, ఏవీ బాలేశంగౌడ్, ముత్యం నర్సింహులుగౌడ్, బాలసాని సురేష్‌గౌడ్, కేసరి ఆంజనేయులుగౌడ్, రాగుల కిరణ్‌కుమార్‌గౌడ్, కొంగ్ర మనోహర్‌గౌడ్, బాలగొని రేఖగౌడ్, మక్తల శైలజగౌడ్ తదితరులున్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన వసతులు కల్పించాలి


మాట్లాడుతున్న వేముల రామకృష్ణ

కాచిగూడ: ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన వసతులు కల్పించి విద్యావ్యవస్థను మరింత పటిష్టం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమై దాదాపు నెల కావస్తున్నా.. చాలా వరకు విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి క్లాస్‌రూమ్స్‌ను డిజిటల్ క్లాస్‌రూమ్స్‌గా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల కంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వివరించారు. అన్ని జిల్లాలకు డీఈఓలుగా గ్రూప్ -1 స్థాయి అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూల్స్, ప్రభుత్వ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు ప్రాధాన్యత కల్పించి, ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించాలన్నారు. రాష్ట్రానికి 10 నవోదయ, 10 కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐడెంటిటీ కార్డ్స్‌తో పాటు సూట్లు, బూట్లు విద్యార్థులకు ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో త్వరలోనే రాష్ట్రస్థాయి విద్యార్థుల సమావేశం నిర్వహించి ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు. బలరామ్, మణికంఠ, వంశీ, యువరాజ్, ప్రవీణ్, ధరం, రుద్ర, శ్రీదేవి, తిరుమల, మంజుల, నీరజ తదితులు పాల్గొన్నారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కొనసాగిద్దాం


నివాళులర్పిస్తున్న డాక్టర్ ఎన్.గౌతంరావు, మాజీ ఎమ్మెల్యే చింతల


మాజీ కార్పొరేటర్ వనం రమేష్ తదితరులు

కాచిగూడ: డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అందించిన సేవలను దేశం నిరంతరం గుర్తించుకుంటుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా శనివారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారతీయ జనసంఘ్‌ను స్థాపించి ప్రజలకోసం, దేశం కోసం పనిచేశారన్నారు. నేడు బీజేపీ ఈ స్థాయిలో ఉండటానికి కారణం శ్యామాప్రసాద్ ముఖర్జీ సిద్ధాంతాలేనని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధనకు పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నేతలు నందకిషోర్‌యాదవ్, కన్నె రమేష్ యాదవ్, వినోద్‌యాదవ్, యశ్వంత్, శ్యామ్‌రాజ్, కృష్ణగౌడ్, వనం రమేష్, సుభాష్ పటేల్, ఆనంద్‌గౌడ్, అనంతలక్ష్మి, అరవింద్, తదితరులున్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శి అశోక్‌యాదవ్, మహేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. అఖిల భారత ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్‌ముదిరాజ్, పార్టీ నేతలు విజయ్ కుమార్, శ్రావణ్, ప్రమోద్, మదన్, నాగులు, వేణు, గణేష్, లోహిత్, విశాల్ తదితరులున్నారు.

నల్లకుంట: నల్లకుంట మాజీ కార్పొరేటర్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు వనం రమేష్ ఆధ్వర్యంలో శనివారం జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. యువత శ్యామాప్రసాద్ ముఖర్జీ దేశభక్తిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఎంబీ. కిశోర్‌కుమార్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజే. బాబు, నాయకులు ఎం. మురళియాదవ్, వెంకటేష్‌గౌడ్ తదితరులున్నారు.

'దళిత క్రైస్తవులను మోసం చేస్తున్న బాబు'

కాచిగూడ: గత 70 ఏళ్లుగా దగాపడ్డ దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని అనేకసార్లు ప్రభుత్వాలను కోరినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కమిషన్ పేర్లతో కాలయాపన చేస్తున్నాయని దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పోచయ్య ఇజ్రాయల్ అన్నారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన చంద్రబాబు నాయుడు ఆ పార్టీ ఎంపీ సభ్యులతో పార్లమెంట్‌లో ఎందుకు బిల్లుపెట్టించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడికి చిత్తశుద్ధి ఉంటే దళిత క్రైస్తవుల ఎస్సీ బిల్లును పార్లమెంట్‌లో పెట్టించి చట్టబద్ధత కల్పించాలన్నారు.

శుభాకాంక్షలు



నల్లకుంట : తెలంగాణ హైకోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన సీనియర్ న్యాయవాది రాంచంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్లు రామారావు, వెంకట తిప్పారెడ్డి తదితరులు ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశంపై అభ్యంతరం

ముషీరాబాద్ : ఇరు తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశంపై తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అభ్యంతరం వ్యక్తం చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌కు 58 శాతం, తెలంగాణకు 42 శాతం ప్రాతిపదికనగా ఆస్తులు, అప్పులు విభజనపై ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. హైదరాబాద్ ఆంధ్రలో విలీనం కాకముందు బీదర్, గుల్బర్గా, రాయచూర్, నాందేడ్,న జాల్నా, పర్బని, ఔరంగాబాద్ తదితర 7 జిల్లాలతో దేశంలోనే నెంబర్ వన్ ఉండేదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. పోలవరం ముంపు గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం, ఉద్యమకారులను సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోలేదని తీవ్ర విమర్శలు చేశారు. కేంద్రంలో బలహీన ప్రభుత్వాన్ని ఆసరాగా చేసుకుని తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. నీల వెంకటేష్, రాజేందర్‌ముదిరాజ్, వేముల రామకృష్ణ, మధుసూదన్‌రావు, తిరుమలగిరి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


హరీష్‌కుమార్

నల్లకుంట: జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి ఓ టిఫిన్ సెంటర్‌లో చెఫ్‌గా పని చేస్తున్న ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు తాడేపల్లికి చెందిన వాసు దేవరాజు కుమారుడు హరీష్‌కుమార్ (32) జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చాడు. గత నెలరోజులుగా నల్లకుంట అడిక్‌మెట్ లలితానగర్‌లోని శన్ముఖ టిఫిన్స్‌లో చెఫ్‌గా పనిచేస్తున్నాడు. అడిక్‌మెట్‌లో నివసించే స్నేహితురాలు పుష్పలత 1వ తేదీన ఉదయం 11.30 గంటల సమయంలో టిఫిన్ సెంటర్ వద్దకు వచ్చి అతడితో మాట్లాడి వెళ్లిందని, 2 న ఫోన్ చేయగా.. స్విచ్ఆఫ్ వచ్చిందని తెలిపింది. ఇంటికొచ్చిన చూడగా.. లేకపోవడంతో పలుచోట్ల ఆచూకీ కోసం ఆరా తీయగా లభించలేదు. దీంతో ఆమె శనివారం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అన్నదానం మహాదానమని మాతావాకర్స్ క్లబ్ నల్లకుంట అధ్యక్షులు డా.వై.మురళీధరుడు అన్నారు. శనివారం వీఎస్‌టీ రోడ్‌లోని కట్టమైసమ్మ ఆలయం వద్ద సుమారు 520 మందికి అన్నదానం చేశారు. సామాజిక సేవలు విస్తృతం చేసేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. ప్రజలు ఎల్లప్పుడు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్లను వెంటనే విడుదల చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు కె.గణేష్, సుమన్‌లు కోరారు. శనివారం జిల్లా డీఆర్‌ఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు గత మూడేళ్లుగా స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడం లేదని, దాదాపు రాష్ట్రంలో రూ.6,900 కోట్లకు పైచిలుకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీనివల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చదువులు ముగిసినా కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్స్ రాకపోవడంతో సర్టిఫికెట్ల విషయంలో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్లు, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరారు. జిల్లా నాయకులు పవన్, మణికంఠ, లక్ష్మణ్, స్టాలిన్ తదితరులున్నారు.

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి


సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: మహిళలు సామాజిక, ఆర్థికంగా రాణించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం అంబర్‌పేట డివిజన్ రఘునాథ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో మైష టైలరింగ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో పలువురు మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలర్, బ్యూటీషియన్, మగ్గం తదితర అంశాల్లో శిక్షణనిచ్చి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వయం ఉపాధి కోసం మహిళలకు పలు అంశాల్లో శిక్షణను ఇవ్వడం అభినందనీయమని సంస్థ నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు రామారావ్‌యాదవ్, రమేష్, రాజు, సంతోష్ తదితరులున్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి..


అశోక్‌నగర్‌లో స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కార్పొరేటర్ గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అన్నారు. శనివారం శారదా మహిళామండలి, స్థానిక మహిళల ఆధ్వర్యంలో అశోక్‌నగర్‌లో వేల్ఫేర్ అసోసియేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు ఏర్పాటు చేసిన వస్త్రాలు, 1 గ్రామ్ గోల్డ్, వివిధ రకాల వంటకాలతో చేసిన స్టాల్స్‌ను ఆమె పరిశీలించి మాట్లాడారు. మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలన్నారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్, మహిళామండలి ప్రతినిధులు, రామ్మూర్తి, కార్యదర్శి సూర్యప్రకాష్, సంయుక్త కార్యదర్శి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం'


మాట్లాడుతున్న ఎం.శ్రీనివాస్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడిచినప్పటికీ నగర ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని సీపీఎం పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. నగరంలోని ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఎం ముషీరాబాద్ నియోజకవర్గం ఆధ్వర్యంలో జూలై 6 నుంచి 15 వరకు చేపట్టిన బస్తీబాట కార్యక్రమంలో భాగంగా శనివారం భగత్‌సింగ్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. బాగ్‌లింగంపల్లి భగత్‌సింగ్‌నగర్‌లోని గుడిసెవాసుల సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుందని ప్రశ్నించారు. 30 ఏళ్లకు పైగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. బస్తీల్లో పేద ప్రజలు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం గుడిసె వాసుల్లోని సగం మందికి కూడా అందడం లేదన్నారు. ఇళ్లల్లోకి మురుగు వస్తుందని వర్షాకాలంలో దోమలు విస్తరించి డెంగీ లాంటి రోగాల భారినపడే ప్రమాదం ఉందన్నారు. ముషీరాబాద్ జోన్ కార్యదర్శి దశరథ్, ఆర్.వెంకటేష్, పద్మ, రమేష్, విమల, మల్లయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న గౌతంరావు, కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. శనివారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి కుద్బిగూడలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెట్లే మానవ మనుగడకు ప్రాణదాయమని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. చెట్లను నరకడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఐదు మొక్కలను నాటేలా కృషి చేయాలని చెప్పారు. ప్రస్తుతం ఉన్న అడవిని 33 శాతానికి పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, కృష్ణసాగర్, సుభాష్ పటేల్, మల్లికార్జున్, ఆర్.సంతోష్, శీర్‌సాగర్, ఉపేందర్, బాలప్రసాద్, నాగరాజు, అనందరావు, దీపక్, పంకజ్ తదితరులు పాల్గొన్నారు.

జీవన సాఫల్య పురస్కారం ప్రదానం


పురస్కారాన్ని అందజేస్తున్న సీహెచ్. త్రినాథరావు

చిక్కడపల్లి: చేయూత ఫౌండేషన్, వేద విజ్ఞానశాస్త్ర వాఙ్మయ అధ్యయన, అభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో 'శ్రీ శ్రీనివాసం భజే' పుస్తక పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం విజయహెల్త్‌కేర్, విజయ హోమ్స్‌ఫర్ ఎల్డర్స్, సత్యసాధన ఫౌండేషన్ తదితర సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ కొమ్మినేని సత్యనారాయణ, డా.కె.విజయలక్ష్మిలకు జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. ప్రముఖ గాయకుడు సీహెచ్. త్రినాథరావు ముఖ్యఅతిథిగా హాజరై వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తమ గురువును ఎంచుకుంటే జీవనగతి ఉత్తమంగా ఉంటుందన్నారు. ప్రముఖులు ఎం.కృష్ణశర్మ, ఎర్రంరాజు, ఎంఆర్‌కేశర్మ, వెంకటరమణ, నరసింహారావు, రామాచారి, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, దైవజ్ఞశర్మ, కామేశ్వరరావు, కేతరాజు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి



ముషీరాబాద్: ప్రగతిశీల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల నాన్ టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ పాఠశాల విద్యా కమిషనర్, స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎస్‌పీడీ) సమగ్ర శిక్షా అభియాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేజీబీవీలలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్, వర్కర్ల రిటైర్మెంట్ వయస్సు 61 నుంచి 65 ఏళ్లకు పొడిగించాలన్నారు. వారి కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ఖాళీ పోస్టులు భర్తీతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, రాష్ట్ర నాయకులు సుధాకర్, నాగమ్మ, అలివేలు తదితరులున్నారు.

నేడు కుసుమ హరనాథ మహాప్రభు జయంతి

నల్లకుంట: నల్లకుంట టీఆర్టీ కాలనీలోని కుసుమ హరనాథ ఆశ్రమంలో నేడు శ్రీ హరనాథ మహాప్రభు 159వ జయంతి నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆశ్రమ పాలకమండలి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవ, అనంతరం 'జయహరనాథ జయకుసుమ కుమారి జయ' భజన ఉంటుందన్నారు. ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అర్ధ ఏకాహము(12 గంటల పాటు) ఉంటుందని వివరించారు.

బడుగుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్

బీజేఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

కవాడిగూడ: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అహర్నిషలు పనిచేసిన బాబు జగ్జీవన్‌రామ ఆశయ సాధనకు నేటి యువత పాటుపడాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపునిచ్చారు. శనివారం కవాడిగూడ డివిజన్ బీమా మైదాన్ వద్ద బీజేఆర్ విగ్రహానికి ఎమ్మెల్యేతో పాటు ముఠా జైసింహ, బీఆర్ఎస్ నేతలు శ్యామ్‌యాదవ్, సాయికృష్ణ, నాయకులు రాజేష్, శ్రీకాంత్, సాయి నివాళులర్పించారు.

- ఇందిరాపార్కు చౌరస్తాలో కార్పొరేటర్ రచనశ్రీ ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ... బీజేఆర్ జీవితకాలం నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేశారని కొనియడారు. ఆశయ సాధనకు నేటి యువత పాటుపడాలని సూచించారు. కవాడిగూడ బీజేపీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, డివిజన్ యువమోర్చా అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, రాష్ట్ర నాయకులు వెంకటేష్, పరిమళ్‌కుమార్, లక్ష్మణ్, బొల్ల రమేష్, శివరాజ్, సుధీర్, అనిల్, లక్ష్మణ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


కవాడిగూడలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్


ఇందిరాపార్కు చౌరస్తాలో కార్పొరేటర్ రచనశ్రీ, బీజేపీ నేతలు